క్లుప్తంగా

గల్ఫ్ గాయం.. కలెక్టర్ సాయం


ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన యువకుడు అనారోగ్యంతో ఇల్లు చేరగా వైద్య ఖర్చులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆర్థిక సాయం అందించారు. బోయినపల్లి మండలం రత్నంపేట కు చెందిన ఎదురుగట్ల నాగరాజు గల్ఫ్ దేశానికి వెళ్లారు. అక్కడే బ్రెయిన్‌స్ట్రోక్, పక్షవాతం రావడంతో స్వదేశానికి తీసుకొచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాలని అతని భార్య లావణ్య కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను ఆశ్రయించారు. స్పందించిన కలెక్టర్ రూ.35వేల చెక్కును నాగరాజు భార్య లావణ్యకు అందించారు.

14న మాదిగల ఆత్మీయ సమ్మేళనం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ సంఘాల నాయకులు

సిరిసిల్ల అర్బన్ : మాదిగల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 14న నిర్వహించనున్నట్లు అంబేద్కర్ సంఘాల జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి కేకన్వర్షన్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాలు, అన్ని సామాజిక వర్గాల నాయకులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, నాయకులు ప్రభాకర్, పర్శరాములు, లక్ష్మణ్, నక్క నర్సయ్య, దేవయ్య, రాము, కిరణ్, శ్రీధర్, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో హక్కుల సాధన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎగమంటి ఎల్లారెడ్డి

సిరిసిల్లటౌన్: పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధించుకోవచ్చని భవన నిర్మాణ సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 15 న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు జిల్లావ్యాప్తంగా భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సీటీటీయూ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమల్లు, శ్రీధర్, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో భారీ వర్షం


మండలకేంద్రంలో కురుస్తున్న వర్షం

ఎల్లారెడ్డిపేట: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ప్రారంభమై ఏకధాటిగా కురిసింది. రోడ్ల వెంబడి వరదనీరు చేరి బస్టాండ్ జలమయంగా మారింది. వ్యాపార సంస్థల్లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో వాహనదారులు, ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

ఉచిత వైద్యశిబిరం



వీర్నపల్లి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అడవి పదిరలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు.

భూమిపూజ

తంగళ్లపల్లి: మండలంలోని అంకిరెడ్డిపల్లె, బద్దెనపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ నూతన భవనాల నిర్మాణానికి బుధవారం ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఎంతఈవో భూక్యా రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఏఎంసీ డైరెక్టర్లు అరెపల్లి బాలు, పరుశరాములు, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుస్మిత, ఏఈ మహేశ్, నాయకులు భూపతి, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, మధు, ప్రశాంత్, మల్లేష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒర్రె దాటేందుకు తిప్పలు

- రేగులపల్లి సమీపంలో ప్రమాదకరంగా ఒర్రె
- రాకపోకలకు రైతులు, ప్రయాణికుల ఇబ్బంది
- వంతెన నిర్మించాలని విజ్ఞప్తి



రేగులపల్లి సమీపంలో ఒర్రెలో పారుతున్న వరదనీరు

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ అనుబంధ గ్రామం రేగులపల్లి పరిసరాల్లో నాగయ్య చెరువు ఒర్రె దాటేందుకు ప్రయాణికులు, రైతులు అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో చెరువుకు వరద పోటు వచ్చే సమయంలో ఒర్రె వరదతో నిండుతోంది. ఈదారి మీదుగా వ్యవసాయ పొలాలకు రైతులు, బావుపేట వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ఒర్రె ప్రాంతంలో వంతెన లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. రేగులపల్లి నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట వెళ్లేందుకు వ్యవసాయ చేలనుంచి దారి ఉంది. దారి ఆధారంగా బోయినపల్లి, ఇల్లంతకుంట, కొత్తపల్లి మండలాల ప్రయాణికులు, రైతులు రాకపోకలు సాగిస్తున్నారు.

వంతెన లేక ఇబ్బంది

వర్షాకాలంలో రేగులపల్లి ఒర్రె వరదతో నిండిపోతుంది. ఇక్కడ వాహనాలు వెళ్లడం లేదు. అతికష్టంతో ఒర్రె దాటుతున్నారు. పక్కన ఉన్న నాగయ్య చెరువు నిండి ఒర్రె ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ఒర్రెకు అటు, ఇటువైపులా పొలాలున్న రైతులు చేలకు వెళ్లేందుకు తంటాలు పడుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే దూరభారం తగ్గడంతో పాటు బోయినపల్లి, ఇల్లంతకుంట, కొత్తపల్లి మండలాలకు చెందిన రైతులు, ప్రయాణికుల ఇక్కట్లు తొలగుతాయని, బావుపేట వెళ్లేందుకు పది కిలోమీటర్ల మేర దూరభారం తగ్గుతుందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో ఈ ఒర్రెపై వంతెన నిర్మించాలని మల్లాపూర్, రేగులపల్లి గ్రామస్తులు అప్పటి ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఒర్రెపై వంతెన నిర్మాణం చేసేందుకు చొరవ తీసుకోవాలని పరిసర గ్రామాలప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వర్షాకాలంలో రేగులపల్లి ఒర్రె వరద నీటితో నిండిపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఈప్రాంతంలో పలువురు రైతుల వ్యవసాయ పొలాలున్నాయి. ఒర్రె అవతల నా పొలం ఉంది. దీంతో చేలకు వెళ్లేందుకు కష్టంగా ఉంది.

– వెంకటేశం, రేగులపల్లి

వంతెన నిర్మించాలి



రేగులపల్లి ఒర్రెపై ప్రయాణం ప్రమాదంగా మారింది. గతంలో వంతెన నిర్మాణం కోసం పరిశీలించారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే బోయినపల్లి, ఇల్లంతకుంట, కొత్తపల్లి మండలాల ప్రయాణికులకు రాకపోకలకు దూరభారం తగ్గుతుంది.

–ఐల శివరాం, మల్లాపూర్

చాకలి ఐలమ్మకు నివాళి

వేములవాడ/వేములవాడఅర్బన్/వేములవాడ రూరల్/కోనరావుపేట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/తంగళ్లపల్లి/ఇల్లంతకుంట/వీర్నపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మను ప్రతీఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండలకేంద్రాలు, గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలమాలవేసి నివాళి అర్పించారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు. రజక సంఘం నాయకులు, పలుపార్టీల నాయకులు తదితరుల పాల్గొన్నారు.



వేములవాడ : తెలంగాణ చౌక్‌లో నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


గంభీరావుపేట: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేస్తున్న కొండూరి, తదితరులు


ఇల్లంతకుంట: బీఆర్ఎస్ కార్యాలయంలో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రసమయి, నాయకులు


కోనరావుపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రొసీడింగ్స్ అందజేత


ప్రొసీడింగ్స్ అందజేసిన విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ : పట్టణ పరిధిలో 43 కుల సంఘాలకు రూ.2.50 కోట్ల నిధుల మంజూరుపత్రాలు అందజేసినట్లు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని 14, 21, 28 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలు, ఉచిత విద్యుత్, సన్నంబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ములవాగు, గుడి చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.6 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు పనులు చేపట్టినట్లు తెలిపారు.

పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలి

- ప్రముఖ పారిశ్రామికవేత్త వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

ముస్తాబాద్: పురిటిగడ్డ రుణం తీర్చుకునే అవకాశం ప్రతీ ఒక్కరికి రావాలని పారిశ్రామికవేత్త చిట్నేని వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం ప్రాథమిక పాఠశాలలో రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు, ఆటోమెటిక్ అలారంను వెంకటేశ్వర్‌రావు బుధవారం ప్రారంభించారు. గూడెం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థిగా, గూడెం వాసిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని వెంకటేశ్వర్‌రావు అన్నారు. గత ఆరేళ్లుగా ముస్తాబాద్ మండలంలో ఆపన్నులకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేస్తున్న వెంకటేశ్వర్‌రావు అభినందనీయులని ఎంఈవో రాజిరెడ్డి అన్నారు. సాధారణ జీవితం నుంచి వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వెంకటేశ్వర్‌రావు ఆదర్శప్రాయులన్నారు. మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ చిట్నేని అంజన్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ సర్పంచ్ చిట్నేని సరిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ శ్రీను, హెచ్ఎం లక్ష్మీపతి, ఎల్లాగౌడ్, బాలయ్య, అక్షయ్, విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కోనరావుపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి మురళినాయక్ అన్నారు. మండలంలోని కనగర్తిలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కొన్ని నెలల నుంచి తమకు కోడిగుడ్ల బిల్లులు రావడంలేదని నిర్వాహకులు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాహకుల గౌరవవేతనం, బిల్లులు త్వరగా వచ్చేలా చూస్తామన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పుట్ట సంపూర్ణ తదితరులున్నారు.


మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈవో మురళినాయక్

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

ఇల్లంతకుంట: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలు పొందవచ్చని ఆయిల్ పామ్ తోటల ఫీల్డ్ ఆఫీసర్ వినయ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఆయిల్‌పామ్ తోటల గెలల కోతను బుధవారం పరిశీలించారు. ఎకరానికి ఏడాదికి లక్షా యాభైవేల ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు వెంకట్ రెడ్డి, కుంట దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

● మూలవాగు బ్రిడ్జి పనులు ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ మూలవాగు బ్రిడ్జి పనులను బుధవారం ప్రారంభించారు. పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బ్రిడ్జి పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో పనులు ప్రారంభం కావడంతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.

● పాఠశాల, కళాశాల భవనాలు పరిశీలన

ముస్తాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాలను డీఈవో వినోద్ బుధవారం పరిశీలించారు. ముస్తాబాద్‌కు డిగ్రీ కళాశాల మంజూరుకాగా బాలికల ఉన్నత పాఠశాల భవనానికి మార్చడం ద్వారా ఎదురయ్యే ఇబ్బందిని క్షేత్రస్థాయిలో డీఈవో తెలుసుకున్నారు. బాలుర గురుకుల పాఠశాలకు జూనియర్ కళాశాల భవనాలను అప్పగిస్తే, జూనియర్ కళాశాలకు బాలికల ప్రభుత్వ పాఠశాల భవనం సరిపోతుందా అనే కోణంలో పరిశీలన జరిపారు. ఎంఈవో రాజిరెడ్డి తదితరులున్నారు.

● మంత్రి వివేక్‌ను కలిసిన మధుకర్

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన కాంగ్రెస్ యూత్ జిల్లా సీనియర్ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ (చోటు) బుధవారం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. చోటు మాట్లాడుతూ జిల్లాకు మంత్రి తొలిసారి రాగా జిల్లా అభివృద్ధికి సంబంధించి వివరాలు తెలిపినట్లు పేర్కొన్నారు.

● బీడీ కార్మికుల పింఛన్ పెంచాలి

బోయినపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళా బీడీ కార్మిలకులకు రూ.4వేలు పింఛన్ ఇస్తామన్న హామీని నెరవేర్చాలని బీడీ సిగార్ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో రత్నంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి సరితకు బుధవారం వినతిపత్రం అందించారు. మండల సీఐటీయూ కన్వీనర్ గురిజాల శ్రీధర్, రామంచ అశోక్, బీడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు గురజాల మమత, రత్నంపేట మహిళా బీడీ కార్మికులు ఉన్నారు.

● ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ శివారులో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ముగ్గురు ప్రవేశించి భూమిని చదును చేయగా తహసీల్దార్ సుజాత ఫిర్యాదు మేరకు వారిపై కేసునమోదు చేశారు. ఎస్సై రాహుల్‌రెడ్డి వివరాలు.. గ్రామ శివారులోని సర్వే నంబర్ 1070 లోని 12 గుంటల్లో అక్రమంగా భూమిని సాగుచేస్తున్న గెంటేడి శ్రీ నివాస్, తిరుపతి, పెద్ద లక్ష్మిపై కేసు నమోదు చేశామన్నారు.

● ఓటర్ల జాబితా ప్రదర్శన

బోయినపల్లి: మండల పరిధిలోని 11 ఎంపీటీసీ నియోజకవర్గాలు, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల అనంతరం తుది ఓటర్ల జాబితాను ఎంపీడీవో భీమా జయశీల ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు.ఎంపీఓ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

● పిడుగుపాటుకు ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం

వేములవాడ: పట్టణంలోని ఓ ఇంటిపై పిడుగుపడి ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. భగవంతరావునగర్‌కు చెందిన మల్లేశం అనే వ్యక్తి ఇంటిపై బుధవారం మధ్యాహ్నం పిడుగుపడింది. ఇంటి గోడతోపాటు ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమైనట్లు కాలనీవాసులు తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

గంభీరావుపేట: చెరువులోపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో జరిగింది. మండలకేంద్రానికి చెందిన మారవేని మల్లవ్వ (68) కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగోలేక కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మంగళవారం ఇంట్లోంచి వెళ్లి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. రాత్రి చెరువులో మృతదేహం లభ్యమైంది. కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు బుధవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. గొల్లపల్లికి చెందిన శైలేందర్ బుధవారం మధ్యాహ్నం అతని స్నేహితుడు కొండాపూర్‌కు చెందిన రాజుతో కలిసి బైక్‌పై వెళ్లాడు. అదే సమయంలో అతని భార్య అడ్డు కోగా.. అక్కడి నుంచి శైలేందర్ వెళ్లిపోయాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. శైలేందర్ భార్య ఫిర్యాదుతో అదృశ్యం కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామ శివారు రాయపల్లి వంతెన ఎల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో రైతులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పనులు పూర్తిచేయాలని అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలుసార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కిరణ్ ఏఈఈ, సెల్ : 9440818864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలుచేయాలి


సిరిసిల్ల కల్చరల్ : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిరిసిల్లకల్చరల్: న్యాయవాదులపై జరుగుతున్న భౌతికదాడులను జిల్లా న్యాయవాదుల సంఘం ఖండించింది. బుధవారం కోర్టు విధులు బహిష్కరిస్తూ నిరసన తెలిపారు. న్యాయస్థానం ముందు దీక్షా శిబిరంలో నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య అన్నారు. దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అడ్వకేట్ల రక్షణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు కోడం సత్యనారాయణ, ఎస్ వసంతం, ఆవునూరి రమాకాంత్‌రావు, చెక్కిల్ల మహేశ్‌గౌడ్, బి.రవీందర్‌రావు, సంజీవ్‌రెడ్డి, కోడం సురేశ్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వేములవాడ కోర్టు ఎదుట..

వేములవాడ: మేడ్చల్ బార్ అసోసియేషన్ సభ్యుడు అడ్వకేట్ సురేశ్ బాబు, ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు జహంగీర్ అలీపై ఇటీవల కొందరు దాడి చేయడాన్ని ఖండిస్తూ వేములవాడ కోర్టు గేటు ముందు అడ్వకేట్లు నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి, అమలు చేయాలన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కటకం జనార్దన్, న్యాయవాదులు గుడిసె సదానందం, రేగుల దేవేందర్, పిట్టల మనోహర్, పెంట రాజు, అన్నపూర్ణ, సుజాత, సరిత, నయిమా నాసారి, కమటం అంజయ్య, కొడిమ్యాల పురుషోత్తం, పర్లపల్లి అంజయ్య, నక్క దివాకర్, పంపరి శంకరయ్య, మారుముఖం అనిల్, హన్మంతరెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే గుర్తింపు

కోనరావుపేట: ఉపాధ్యాయులు చేసిన సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఏంఈవో మురళినాయక్ అన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన గోలి రాధాకిషన్, అరుకాల బాల్‌రెడ్డిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినోద్‌కుమార్, నర్సయ్య, రమణారెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, డెయిరీ చైర్మన్ జిల్లెల్ల లక్ష్మారెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కమలాకర్, రావులపెల్లి గంగారెడ్డి, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ పుట్ట సంపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కోనరావుపేట : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో, తదితరులు

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నువ్వూరి దేవేందర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికకాగా బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ పందిర్ల శిరీష, డైరెక్టర్ బాలయ్య, మాజీ ఎంపీపీ పల్లి రేణుక, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం



బోయినపల్లి: మండల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ద్యావనపెల్లి శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి, కోశాధికారిగా దండు రాజమల్లయ్య, అసోసియేషన్ అధ్యక్షులుగా చెంద్రయ్య, వెంకయ్య, జే.లక్ష్మి, సహాయకార్యదర్శిగా కే.అంజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చాడ నారయణరెడ్డి, ప్రచార కార్యదర్శిగా సిహెచ్. మల్లయ్య, జిల్లా కౌన్సిలర్‌గా సి.రామరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు బలరాం, కార్యదర్శి ఎస్. సుధాకర్, టీవీ. లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో మినీ గూడ్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మేగి దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా రామపాటి సుబ్బారావు, మిర్యాల్‌కర్ కిషన్, ఉపాధ్యక్షుడిగా నర్ర శ్రావణ్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానించారు.

ఏకలవ్య ఎరుకల సంఘం కార్యవర్గం

మండలకేంద్రంలోని ఏకలవ్య ఎరుకల సంఘం కార్యవర్గం ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా కొనేటి భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా కొనేటి ఆంజనేయులు, హనుమ మురళి, ప్రధాన కార్యదర్శిగా కొనేటి రాజయ్య, కోశాధికారిగా రాజయ్యను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘం ప్రతినిధులు సన్మానించారు.

నోట్‌బుక్స్ అందజేత

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక హైస్కూల్, తాళ్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం 73 మందికి నోట్‌బుక్స్, పెన్నులను బుధవారం అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం రేవతి, కమిటీ చైర్మన్ లీల, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై సాంకేతిక పనిభారం తగ్గించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ జిల్లా ఉన్నతాధికారులను కోరారు. ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో బుధవారం సభ్యత్వం స్వీకరించారు. అనంతరం హన్మాజిపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్టీయూ వేములవాడ రూరల్ మండలశాఖ ఎన్నికలు నిర్వహించారు. ఎస్టీయూ రూరల్ మండల అధ్యక్షుడిగా ఎం కిషన్, మండల ప్రధాన కార్యదర్శిగా జి మహేశ్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రభుత్వం వెంటనే ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేరియాలన్నారు.

నియామకం


శ్రీనివాస్ గౌడ్

గంభీరావుపేట: సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లికి చెందిన లచ్చులగారి శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు వీరస్వామిగౌడ్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. గీత కార్మికుల హక్కుల కోసం పనిచేస్తానని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.